## క్లుప్తంగా

### ఎమ్మెల్యే పూజలు



దేవాలయంలో పూజలు చేస్తున్న సామేల్

**మోత్కూరు:** మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని బుజిలాపురం గ్రామంలో జరుగుతున్న శ్రీ వెంకటేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలకు శనివారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, నాయకులు, అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మలిపెద్ది రజిత, మాజీ సర్పంచ్‌లు చేతరాశి వీరస్వామి, చేతరాశి అంజయ్య, ఉపేందర్‌రెడ్డి, ఆలయ నిర్మాణ దాత ఎగమాటి రాంరెడ్డి, మలిపెద్ది మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### చెత్త తొలగింపు

**రామన్నపేట:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో పేరుకుపోయిన చెత్తను స్థానిక గ్రామపంచాయతీ సిబ్బంది శనివారం తొలగించారు. 'బడి ఇలా.. చదివేది ఎలా' శీర్షికన శుక్రవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు.

### కొనసాగుతున్న శ్రీకనకదుర్గ దేవాలయ ఉత్సవాలు



శోభాయాత్రలో పాల్గొన్న గ్రామస్తులు

**ఆత్మకూరు(ఎం):** మండల కేంద్రంలో ఐదు రోజులుగా శ్రీకనకదుర్గమ్మ దేవాలయ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం ఆలయ నిర్మాణ దాతలు ఏనుగు సురేందర్‌రెడ్డి-సునందిని దంపతులు శివస్వాములకు అన్నదానం చేశారు. గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రీపుష్పగిరి పీఠాధిపతులు మదనభినోద్దండ విద్యాశంకరభారతి ఆధ్వర్యంలో వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ యాస కవిత, మాజీ ఎంపీపీ హేమలత, మాజీ జెడ్పీటీసీ పూర్ణచందర్‌రాజు, మాజీ సర్పంచ్‌లు జన్నాయికోడె నగేష్, బీసు చందర్ గౌడ్, యాస లక్ష్మారెడ్డి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

### ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

**వలిగొండ:** మండలంలోని గోకారంలో మూసీ పరీవాహక ప్రాంతం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను శుక్రవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. అదే ప్రాంతంలో అక్రమంగా నిల్వ చేసిన సుమారుగా 20 ట్రాక్టర్ల ఇసుక డంప్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ లాల్ శనివారం తెలిపారు.

**అజీంపేటలో..**

**అడ్డగూడూరు:** అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగరాజు శనివారం తెలిపారు. అడ్డగూడూరు మండల పరిధిలోని అజీంపేట గ్రామానికి చెందిన లింగాల కుమారస్వామి తన ట్రాక్టర్‌తో శనివారం మూసీ వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు అక్కడకు వెళ్లారు. ట్రాక్టర్‌ను పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### వైభవంగా మహమ్మాయిదేవి, పరమేశ్వరుల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**భూదాన్‌పోచంపల్లి:** పట్టణ కేంద్రంలోని శ్రీమహమ్మాయిదేవి దేవాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీ మహమ్మాయిదేవి, పరమేశ్వరుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం రుద్రాభిషేకం, నైవేద్య నివేదన, భక్తులకు మహా అన్నదానం చేశారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ చేపూరు రామ్మోహనచారి, నందిగామ కృష్ణమాచారి, రాఘవేంద్రచారి, ఎర్రోజు స్వామి, దేవరకొండ ఆనంద్‌చారి, చేపూరి ఎర్రోజు ప్రభాకరచారి, శ్రీనివాసచారి, గుంటోజు యాదగిరిచారి, బ్రహ్మచారి, మహేశ్, రవి, దేవాలయ అర్చకులు మహంకాళి శ్రీనివాసశర్మ తదితరులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్స్ డే

**బీబీనగర్:** మండలంలోని కొండమడుగు, రాఘవాపురం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం టీచర్స్‌డే నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నారులు అంగన్‌వాడీ టీచర్లుగా, ఆయాలుగా వ్యవహరించారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లు షాహెదాబేగం, శోభారాణి, రహీమున్నీసా, ఆయా పద్మ తదితరులు పాల్గొన్నారు.

# శంకుస్థాపనకే పరిమితం!



కాచారం- పెద్దకందుకూరు వరకు ఉన్న మట్టి రోడ్డు



బీటీ రోడ్డు నిర్మాణానికి వేసిన శిలాఫలకం

- కాచారం- పెద్దకందుకూరు బీటీ రోడ్డుకు కలగని మోక్షం
- శంకుస్థాపన చేసి రెండు సంవత్సరాలు
- నేటికీ ప్రారంభం కాని పనులు

**యాదగిరిగుట్ట రూరల్:** ప్రభుత్వాలు మారుతున్నా గ్రామీణ రహదారులు మాత్రం మరమ్మతులకు నోచుకోవడం లేదు. యాదగిరిగుట్ట మండలంలోని కాచారం క్రాస్ రోడ్డు నుంచి, కుమ్మరిగూడెం, యసోజిగూడెం, వయా బాహుపేట, తాళ్లగూడెం, పెద్దకందుకూరు గ్రామాల వరకు ఉన్న మట్టి రోడ్డు పూర్తిగా అధ్వానంగా మారింది. ఈ రోడ్డు నిర్మాణానికి గత రెండు సంవత్సరాల క్రితం అప్పటి ప్రభుత్వం రూ.2కోట్ల 89లక్షల నిధులు మంజూరు చేసింది. అప్పటి ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కానీ రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఈ రోడ్డుకు మోక్షం కలగడం లేదు..

**అధ్వానంగా మట్టిరోడ్డు**

కాచారం క్రాస్ రోడ్డు నుంచి దాదాపు 4.85 కిలోమీటర్ల మేర ఉన్న రోడ్డు పూర్తిగా గతుకులు గుంతలు ఏర్పడి అధ్వానంగా మారింది. ఈ రోడ్డుపై ప్రయాణించే ప్రయాణికులు, మరియు చిన్న, పెద్ద వాహనదారులు రాకపోకలు సాగించాలంటే అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు మార్గం పూర్తయితే యాదగిరిగుట్ట మండల కేంద్రానికి వెళ్ళి రావడానికి రవాణ సౌకర్యం ఏర్పడుతుంది. రోడ్డు పనులు పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

### ఇబ్బందులు పడుతున్నాం



కాచారం నుంచి బాహుపేట వరకు ఉన్న మట్టి రోడ్డుతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. కొన్ని సంవత్సరాలుగా మట్టి రోడ్డు పూర్తిగా గుంతలమయింది.. వర్షకాలంలో ఈ గుంతలతో అవస్థలు పడుతున్నాం. ఈ మార్గం గుండా ప్రయాణాలు సాగించలేకపోతున్నాం. శంకుస్థాపన చేసి రెండు సంవత్సరాలు గడుస్తున్నా రోడ్డు మాత్రం వేయడం లేదు.

– కుండె బీరయ్య, బాహుపేట

### నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు



కాచారం క్రాస్ రోడ్డు నుంచి యాసోజిగూడెం, కుమ్మరిగూడెం, వయా బాహుపేట, తాళ్లగూడెం వరకు బీటీ రోడ్డు వేసేందుకు రెండు సంవత్సరాల క్రితం శంకుస్థాపన చేశారు. అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా సంవత్సరాలు గడుస్తున్నా రోడ్డు మాత్రం వేయడం లేదు. బీటీ రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలి.

– కవిదె మహేందర్, బాహుపేట

### మాదిగ ఉపకులాల సమస్యలు పరిష్కరించాలని వినతి



ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేస్తున్న మేడి పాపయ్య

**ఆత్మకూరు(ఎం):** మాదిగ ఉపకులాల సమస్యలను పరిష్కరించాలని ఆత్మకూరు(ఎం) మండలం పల్లెర్ల గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య కోరారు. ఈమేరకు శనివారం హైదరాబాద్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వినతి పత్రం అందజేశారు. ఆయన వెంట ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కూరెల్ల రమేష్, యువ కవి బైరపాక స్వామి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జమునయ్య, ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మేడి రమణ, నాయకులు సుధాకర్, మహేందర్, మణికుమార్ ఉన్నారు.

### ఉచిత వైద్యశిబిరం

**భువనగిరి రూరల్:** మండలంలోని కూనూరు గ్రామంలో శనివారం సంధ్య దంత వైద్యశాల, కూనూరు ఎంపీటీసీ పాశం శివానంద్ ఆధ్వర్యంలో డాక్టర్ సుదీర్ రెడ్డి పర్యవేక్షణలో దంత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యశిబిరాన్ని రూరల్ ఎస్సై సంతోష్ కుమార్ ప్రారంభించగా ఎస్సై శివనాగప్రసాద్, మాజీ సర్పంచ్ డోకె బాలకృష్ణ, శ్రీనివాస్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### గుండెపోటుతో బీఆర్ఎస్ నాయకుడు చంద్రం మృతి



చంద్రం (ఫైల్)

**భూదాన్‌పోచంపల్లి:** పట్టణ కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు దొడ్డమోని చంద్రం యాదవ్(48) శనివారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందారు. సాయంత్రం ఛాతిలో నొప్పి వస్తుందని చెప్పడంతో కుటుంబ సభ్యులు స్థానికంగా ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు హైదరాబాద్‌కు తీసుకెళ్లమని సలహా ఇవ్వడంతో వెంటనే వాహనంలో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందాడని తెలిపారు.

### ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా రాజు

**సంస్థాన్ నారాయణపురం:** మండలంలోని లచ్చమ్మగూడెం గ్రామానికి చెందిన జక్కలి రాజు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా నియమామయ్యారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

### సీసీరోడ్డు పనులు ప్రారంభం

**తుర్కపల్లి:** మండలంలోని దత్తాయపల్లిలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను శనివారం కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎరుకల వెంకటేశ్‌గౌడ్ ప్రారంభించారు. మల్లేశం, ఐలయ్య, వీసం రాజయ్య, బాలయ్య, చంద్రయ్య, కరుణాకర్, గంగయ్య, రాజు, పోచయ్య, అశోక్, ఎల్లయ్య, వెంకటయ్య, కృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

## ప్రజలకు నీటి ఎద్దడి రానీయొద్దు

- ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుంభం

**భువనగిరి టౌన్:** ప్రజలకు నీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం భువనగిరి పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో భువనగిరి రూరల్ వాటర్ సప్లై అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. నియోజకవర్గంలో కరెంట్‌కు అంతరాయం రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎలక్ట్రిసిటీ అధికారులకు సూచించారు.

**బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి**

**బీబీనగర్:** లింగబస్వేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి కోరారు. బీబీనగర్ మండలంలోని పడమటిసోమారం గ్రామంలో శ్రీలింగబస్వేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు మార్చి 4నుంచి జరగనుండడంతో శనివారం ఆలయం వద్ద బ్రహ్మోత్సవాల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆర్డీఓ అమరేందర్, ఎంపీపీ సుధాకర్‌గౌడ్, తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఈఓ నరేందర్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యేకు సన్మానం**

**రామన్నపేట:** భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని స్థానిక కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. శనివారం రామన్నపేటలో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ఆయనకు స్థానిక కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ జమీరొద్దిన్, నాయకులు వనం చంద్రశేఖర్, గట్టు నరేందర్, ఆముద లక్ష్మణ్, గొలుసుల ప్రసాద్, లవనం సాయి, కేశవదాసు ఉదయ్, మోటె క్రాంతికుమార్, జమ్మి రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

**మౌలిక వసతుల కల్పనకు కృషి**

**వలిగొండ:** ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం వలిగొండ మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ ఉన్నత పాఠశాల 60 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. పాఠశాల అభివృద్ధికి రూ.10లక్షల నిధులు కేటాయిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నూతి రమేష్, జెడ్పీటీసీ వాకిటి పద్మాఅనంతరెడ్డి, వైస్ ఎంపీపీ బాతరాజు ఉమా బాల్‌నర్సింహ, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్ బోళ్ల లలిత, వరంగల్ నీట్ ప్రొఫెసర్ డాక్టర్ హరిప్రసాద్, ప్రజా కవి కోదారి శ్రీను, ఎంఈఓ శ్రీధర్ పాల్గొన్నారు.

## యాదాద్రి ఎస్ఎంఆర్‌ల రెగ్యులరైజేషన్ రద్దు

**యాదగిరిగుట్ట:** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో 2018లో రెగ్యులర్ అయిన ఆరుగురు సిబ్బంది ఉద్యోగాల నియామకాన్ని దేవాదాయశాఖ కమిషనర్ రద్దు చేసినట్లు దేవస్థానం అధికారులు శనివారం వెల్లడించారు. యాదాద్రి అనుబంధ ఆలయమైన పాతగుట్ట, శివాలయంలో ఎస్ఎంఆర్‌లుగా విధులు నిర్వహిస్తున్న మురళిధర్‌శర్మ, భరత్, సత్యనారాయణచార్యులు, శివాలయంలో విధులు నిర్వహిస్తున్న టి.నర్సింహమూర్తి, పి.నర్సింహమూర్తిలతో పాటు మరొకరు మస్తాన్ అనే సిబ్బంది 2018కంటే ముందు తాము 15ఏళ్లుగా ఎస్ఎంఆర్‌లుగా విధులు నిర్వహిస్తున్నామని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారి విన్నపాన్ని ఉన్నతాధికారులు పరిగణలోకి తీసుకొని వారిని 121 జీఓ ప్రకారం రెగ్యులరైజ్ చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. అయితే వీరికి 121 జీఓ వర్తించదని, ఇది కేవలం చిన్న ఆలయాల్లో విధులు నిర్వహించే ఎస్ఎంఆర్‌లకే వర్తిస్తుందని ఆడిటర్ శాఖ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని దేవాదాయశాఖ కమిషనర్‌కు పంపించారు. దీంతో ఆరుగురి రెగ్యులరైజేషన్ రద్దు చేసి, తిరిగి ఔట్‌సోర్సింగ్ ఎస్ఎంఆర్‌లుగా విధులు నిర్వహించాలని ఆదేశించినట్లు ఆలయాధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా.. ఆరుగురిలో మస్తాన్ అనే వ్యక్తి ఆరు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు.

### మాక్ అసెంబ్లీ



మాక్ అసెంబ్లీలో పాల్గొన్న విద్యార్థులు

**రామన్నపేట:** మండలంలోని వెల్లంకి జెడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా శనివారం మాక్ అసెంబ్లీ ఏర్పాటు చేశారు. పలువురు విద్యార్థులు అధికార, ప్రతిపక్ష నాయకులుగా వ్యవహరించారు. బడ్జెట్‌లో కేటాయింపులు, ఆరు గ్యారెంటీల అమలు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంపై చర్చించారు. ప్రధానోపాధ్యాయుడు సత్తిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీటీసీ ఎర్రోళ్ల లక్ష్మమ్మ, మాజీ సర్పంచ్ నర్సింహాచారి, చంద్రశేఖర్ రావు, పద్మ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### పాఠశాల వార్షికోత్సవం

**తుర్కపల్లి:** మండలంలోని గొల్లగూడెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ జంగిటి కృష్ణ, మాజీ సర్పంచ్ సొక్కుల మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మోహన్‌బాబునాయక్, ప్రధానోపాధ్యాయురాలు వీణ, ఉపాధ్యాయులు సుభాషిణి, జయలక్ష్మి, మంజుల, హారతి, బాలకృష్ణ, మండల నోడల్ ఆఫీసర్ మాలతి, పూర్వ ఉపాధ్యాయులు శోభారాణి, అజీమా, వెంకటేశం, నాగరాజు, శ్రీశైలం, నాగిరెడ్డి స్వరూప, ఎస్ఎంసీ చైర్మన్ పోచమల్లు, డీసీసీ ఉపాధ్యక్షుడు రాజయ్య, సుగ్రీవాచారి, సతీష్, బాలగురువు, శ్రీనివాస్, బాలయ్య, మల్లేశ్ పాల్గొన్నారు.

### క్రీడలతో మానసిక ఉల్లాసం

**భువనగిరి రూరల్:** క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షురాలు గునుగుంట్ల కల్పన అన్నారు. మండలంలోని అనాజిపురం గ్రామంలో క్రీడాకారులకు శనివారం ప్రభుత్వ క్రీడా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో పాల సంఘం మాజీ చైర్మన్ ఏదునూరి మల్లేశం, పంచాయతీ కార్యదర్శి బట్టు స్వాతి, మాజీ వార్డు సభ్యులు మామిడాల శ్రీనివాస్, పిట్టల వెంకటేశం, నాయకులు ఏశాల కృష్ణ, ఏశాల మురళి, కడారి భరత్, గోగు మల్లేశం, శ్రీశైలం, స్వామి పాల్గొన్నారు.

### రికార్డుల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న వెంకటేశ్వర్లు

**మోటకొండూర్:** మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను శనివారం జిల్లా ప్రణాళిక అధికారి వెంకటేశ్వర్లు పరిశీలించారు. అదేవిధంగా వర్షపాత రిజిస్టర్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శాంతిలాల్, జిల్లా గణాంక అధికారి రాజ్యం, ఉపగణాంకాధికారి గనిపల్లి అనిల్ బాబు, మండల అధికారి సంతోష్ ఉన్నారు.

### గ్యాస్ సిలిండర్ పేలి ఇద్దరికి స్వల్పగాయాలు

**ఆలేరురూరల్ :** గ్యాస్ సిలిండర్ పేలి ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆలేరు పట్టణ కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. ఆలేరు పట్టణ కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో పరివార్ బిర్యానీ సెంటర్‌లో ఉదయం వంట గ్యాస్‌పైన ఉన్న మూతను ఓపెన్ చేసే క్రమంలో గ్యాస్ లీకై గ్యాస్‌బుడ్డీలో నుంచి మంటలు వచ్చాయి. దీంతో కిచెన్‌లో ఉన్న కిషోర్, కృష్ణ బయటికి పరుగులు తీశారు. సిలిండర్ పేలి మంటలు వ్యాపించాయి. స్థానికులు అందించిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పారు. కిచెన్‌లో ఉన్న వస్తువులు కాలిపోయాయి. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని ఎస్సై వెంకటశ్రీను తెలిపారు.

### పీడీఎస్ బియ్యం పట్టివేత

**వలిగొండ:** మండలంలోని నాగారం సమీపంలో ఉన్న ధనలక్ష్మి రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వ చేసిన 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని శనివారం భువనగిరి ఎస్ఓటీ పోలీసులు పట్టుకుని, స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ లాల్ తెలిపారు.

### చిన్నమేడారంలో పూజలు

**ఆలేరురూరల్:** ఆలేరు మండలంలోని కొలనుపాక గ్రామ సమీపంలో చిన్న మేడారంలో కొలువుదీరిన వనదేవతలకు శనివారం భక్తులు వడిబియ్యాలు, గాజులు, పసుపు కుంకుమ, వస్త్రాలు సమర్పించుకున్నారు. గద్దెలపై కొలువుదీరిన దేవతలు సాయంత్రం వనప్రవేశం చేశారు.

## ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి

- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



ప్రధానోపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ

**బొమ్మలరామారం:** ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. శనివారం బొమ్మలరామారం మండలంలోని మర్యాల జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవ వేడుకలో ఆయన మాట్లాడారు. మర్యాల పాఠశాలలో చదువుకున్న చాలా మంది పూర్వ విద్యార్థులు ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణ, పూర్వ విద్యార్థి ఎస్ఐ అశోక్, కుర్మిండ్ల ఈశ్వర్ గౌడ్, దామోదర్ గౌడ్, హెడ్మాస్టర్ నిర్మలజ్యోతి, సురేందర్ రెడ్డి, కృపానందం, రవి వర్ధన్, మన్నె భవాని తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణలో పేదలకు అన్యాయం చేయొద్దు



సమావేశమైన రోడ్డు విస్తరణ బాధితులు

**చౌటుప్పల్:** పేదలకు అన్యాయం చేయకుండా చౌటుప్పల్ పట్టణంలోని చిన్నకొండూర్ రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి అన్నారు. స్థానిక కచ్చీర్ వద్ద శనివారం రోడ్డు విస్తరణ బాధితులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రస్తుతం ఉన్న విధంగా రోడ్డును 21ఫీట్లుగా విస్తరించాలని తీర్మానించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, కౌన్సిలర్ పోలోజు శ్రీధర్‌బాబు, స్థానికులు దండ అరుణ్‌కుమార్, బొడిగె బాలకృష్ణ, బొబ్బిళ్ల శ్రీరాములు, ఎండీ ఖయ్యూం, వరగంటి రాజేందర్, మహేందర్, చింతల తిరుమల్‌రెడ్డి, గడ్డం రఘుపతి, రాజపేట అశోక్, రాజు, శివకుమార్, నరేష్, గణేష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

**భువనగిరి రూరల్:** రాయగిరిలోని శ్రీవేంకటేశ్వస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి వెంకటేశ్వర స్వామి కల్యాణం కనులపండుగగా నిర్వహించారు. సౌమిత్రి వెంకటాచార్యులు, సౌమిత్రి రామాచార్యుల ఆధ్వర్యంలో గణపతి పూజ, మహా రుద్రాభిషేకం జరిపించారు. యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం ఈఓ రామకృష్ణారావు పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్నబోయిన ఆంజనేయులు, మాజీ వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య, మాజీ ఎంపీటీసీ పాల్య హనుమంతు నాయక్, ఏఈఓ రఘు, సూపరింటెండెంట్ రామారావు, లక్ష్మీనర్సింహరావు, శ్రవణ్, మాజీ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### ఆశ్రమ వార్షికోత్సవం



యజ్ఞం నిర్వహిస్తున్న శంకరానందస్వామిజీ

**సంస్థాన్ నారాయణపురం:** మండలంలోని దుబ్బల గ్రామ పరిధిలోని శ్రీ అన్నపూర్ణేశ్వరి ఆశ్రమ వార్షికోత్సవ వేడుకలు శనివారం శంకరానందస్వామిజీ సమక్షంలో వైభవంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా పీఠాధిపతులు దయానందస్వామిజీ, నిత్యానందభారతీస్వామిజీ, నిర్మలానందమాతాజీ, జయదేవానందస్వామిజీ, స్వామిసిద్ధయోగి పాల్గొని గీతజ్ఞాన యజ్ఞం నిర్వహించారు. శివ మాలధారులు మహాపడి పూజ చేశారు.

### నిందితుడి కోసం గాలింపు

**ఆత్మకూరు(ఎం):** మండలంలోని రాఘవాపురంలో తాళం పగుల గొట్టి చోరీకి పాల్పడిన నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. తుమ్మలగూడెం రామనర్సయ్య-రాధ దంపతులు ఇంటికి తాళం వేసి వ్యవసాయ బావి వద్దకు పోయారు. రాధ మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూసే సరికి తాళం పగులగొట్టి తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూసే సరికి అదే గ్రామానికి చెందిన బద్దుల అనిల్ బీరువా తెరిచి పది తులాల బంగారు ఆభరణాలు తీసుకుని నగదు కోసం వెతుకుచుండగా కేకలు వేసింది. దీంతో అనిల్ ప్రహరీ దూకి పారిపోయిన విషయం పాఠకులకు తెలిసిందే. అయితే అనిల్ ఫొటోను పోలీసులు గుర్తించారు. రాఘవాపురం నుంచి మోత్కూరు మండలం పాలడుగు వైపు పారిపోవడంతో అమ్మనబోలు, తిరుమలగిరి, నార్కట్‌పల్లి, మోత్కూరు, నల్లగొండ ప్రాంతాల్లో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**భువనగిరి:** పట్టణంలోని మీనానగర్‌తో పాటు గ్రంథాలయం ఏరియాకు ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పట్టణ విద్యుత్ ఏఈ సాయికృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ స్థంబాల మరమ్మతుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## పాఠశాలల్లో స్వపరిపాలన దినోత్సవం



ఆత్మకూరు(ఎం): జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల వేషధారణలో విద్యార్థులు



తుర్కపల్లి: బచ్చలగూడెం పాఠశాలలో ఉపాధ్యాయులుగా విద్యార్థులు



భువనగిరి రూరల్: చీమలకొండూర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు



వలిగొండ: గాయత్రి పాఠశాలలో ఉపాధ్యాయులుగా విద్యార్థులు



రామన్నపేట: సిరిపురం పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు



చౌటుప్పల్: తాళ్లసింగారం ప్రాథమిక పాఠశాలలో..



సంస్థాన్ నారాయణపురం: ఉపాధ్యాయుల వేషధారణలో విద్యార్థులు



రాజాపేట: ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు